# ‘ఏరో స్పేస్–డిఫెన్స్ హబ్’గా ఏపీ

విజయవాడ, ఫిబ్రవరి 14: అనంతపురము, చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో ఏరోస్పేస్, డిఫెన్స్ పార్కుల ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. ఈ రెండు రంగాలలో అత్యాధునిక సాంకేతిక పరిశోధన, హార్డ్‌వేర్ అభివృద్ధిని మాన్యుఫాక్చరింగ్ సెంటర్లతో ముడిపెడుతూ వినూత్న ఆవిష్కరణల వేదికగా మలచడానికి ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో వున్నారు. ఏపీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పాలసీ ఈ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులకు ఆస్కారం కల్పిస్తూ అందుకు తగిన వాతావరణాన్ని రాష్ట్రంలో కల్పించింది. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలోని ఒక బృందం ‘ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ ఆపర్చునిటీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్’ అనే అంశంపై మంగళవారం బెంగళూరులో జరిగిన గ్లోబల్ సీఈవోల కాంక్లేవ్‌లో పాల్గొని రాష్ట్రంలో ఈ రంగంలో గల అవకాశాలను వివరించారు. భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి డేనియల్ కార్మొన్, సిబాట్ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో ఏపీ బృందం సమావేశమై ఇజ్రాయెల్, ఏపీ మధ్య పరస్పర దృఢమైన సాంకేతిక సహకారం గురించి చర్చించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు, ఏపీ ఈడీబీ సీఈవో జాస్తి కృష్ణ కిశోర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో, ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పెట్టుబడులకు గల అవకాశాలపై ఈ బృందం ఒక ప్రెజెంటేషన్ ఇచ్చింది.

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డీఆర్ డీవో మిస్సయిల్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. రానున్న కాలంలో అనంతపురము ఏరోస్పేస్ డిఫెన్స్ హబ్‌గా మారనున్నదని తెలిపింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో బీఈఎల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ రానున్నదని, పాల సముద్రంలో వైటల్ ఇన్నోవేషన్ సిటీ, గుడిపల్లిలో భారత్ ఫోర్జ్ మల్టీ మోడల్ మాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయబోతున్నాయని బృందం పేర్కొంది. విశాఖనగరానికి సమీపంలోని భోగాపురంలో వరల్డ్ క్లాస్ ఎంఆర్ఓ ఫెసిలిటీ, ఎయిర్ కార్గో కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అలాగే విశాఖలో యునైటెడ్ షిప్ బిల్డింగ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నౌకా నిర్మాణాల సామర్థ్యాలను పెంచేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని గుర్తుచేసింది. రాంబిల్లిలో రిలయెన్స్ డిఫెన్స్ ఆధ్వర్యంలో నావల్ షిప్ బిల్డింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తున్నట్టు, మచిలీపట్నంలో బీఈఎల్ అత్యాధునిక నైట్ విజన్ ప్రాజెక్టు తయారీ యూనిట్‌ను, నాగాయలంకలో మిస్సయిల్ లాంఛ్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు బృందం తెలిపింది.